# పొరపాటూ ఓ అలవాటే!

ప్రతి ఒక్కడికీ ఏదో అలవాటు ఉంటుంది. ఏ అలవాటూ లేనివాడు ఉండనట్టే ఏ పొరపాటూ చేయని వాడుండడు.

అలవాట్లలో మంచి అలవాట్లూ ఉంటాయి. చెడ్డ అలవాట్లూ ఉంటాయి. ఒక వ్యక్తికున్న మంచి అలవాట్ల వల్ల అతనికేకాకుండా ఇతరులకు కూడా మంచి జరుగుతుంది. అలాగని అలవాట్ల కారణంగా ఒక వ్యక్తిని మంచివాడిగానో చెడ్డవాడిగానో నిర్ణయించడానికి వీలులేదు. మంచి అలవాట్లు ఉన్నవాడు దుర్మార్గుడు కావొచ్చు. అలాగే చెడ్డ అలవాట్లు ఉన్నవాడు ధర్మాత్ముడు కావచ్చు.




అలవాట్లు సాధారణ జీవితంలో ఉన్నట్టే నటన, తదితర కళారంగాల్లో కూడా ఉంటాయి. డైలాగ్ చెప్పడంలో, మూవ్‌మెంట్ ఇవ్వడంలో కొందరికి కొన్ని అలవాట్లుంటాయి. దాన్నే స్టయిల్ అని కూడా అంటాం.

దిలీప్‌కుమార్ డైలాగ్ చెబుతూ, అప్పుడప్పుడూ ముక్కు గోకుతుంటాడు. అలా చేయడం వల్ల ఆ పాత్ర వాస్తవికంగా ప్రవర్తిస్తున్నట్టు కనిపిస్తుంది. ఎన్టీ రామారావు మారువేషాలు వేసినప్పుడు, ముఖ్యంగా గెడ్డం పెట్టుకున్న పాత్ర చేసినప్పుడు గెడ్డాన్ని తరుచూ నిమురుతుంటాడు. నడుం కాస్త వంచడమూ, కుప్పిగంతులు వేయడమూ చేస్తుంటాడు. ఓకన్ను మూస్తుంటాడు. మారువేషాలు వేసినప్పుడు అవి ఆయన అలవాట్లు అనుకోవచ్చు.

ఇక అలవాటులో పొరపాటూ జరుగుతూంటుంది. గతంలో ఒక పనిచేసి, మరో పనిలోకి దిగినప్పుడు పాత అలవాటు కొద్దీ పొరపాట్లు జరుగుతుంటాయి. ఎన్టీ రామారావు రాజకీయాల్లోకొచ్చినా సినిమా ఫక్కీలోనే మాట్లాడేవాడు. ఆ అలవాటును జనం పొరపాటుగా భావించలేదు సరికదా, ఇష్టపడ్డారు.

ఒక్కోసారి తన ఊహ, లేదా ఆశను వెల్లడించే పొరపాటు కొందరు చేస్తుంటారు. ఓసారి ఎన్టీ రామారావు తాను ముఖ్యమంత్రినన్న మాట మరిచిపోయి ప్రధానిగా వ్యవహరించాడు. ఆ వెంటనే నాలుక కరుచుకున్నాడు. సినీరంగంలో తన కొడుకు బాలకృష్ణను తనకు వారసుడిగా చేసిన ఎన్టీఆర్ రాజకీయాల్లో కూడా అతన్ని తన వారసుడిగా ప్రకటించి అలవాటులో పొరపాటు చేశాడు. ఆ వార్త పత్రికల మొదటి పేజీలకెక్కడంతో ఆతర్వాత, తను అలా అనలేదనీ, పత్రికలే పొరపాటుగా రాశాయనీ ఆయన బుకాయించాడు.

రాజకీయ నాయకులు చాలా మంది ఈ అలవాటులో పొరపాటు చేస్తుంటారు. చాలామంది పొరపాట్లు చెయ్యడం తమ అలవాటుగా చేసుకుంటారు. ఒక ఆవేశంలోనో, ఆనందంలోనో నిజాలు చెప్పేసి, పత్రికల్లో వచ్చేక, నాలుక్కరచుకుని, తాము అలా అనలేదని చెబుతుంటారు అలా అంటూ ఉండడం వాళ్లకూ అలవాటు అయిపోతుంది.

కె.వి.యస్.వర్మ ఫీచర్స్

ఎవరన్నా ఏదన్నా తమ పని చెయ్యమని అడిగినప్పుడు "అలాగే చేస్తాను" అని చెప్పకుండా, "చూద్దాం" అనడం చాలామంది నాయకుల అలవాటు, కొంతకాలం క్రితం "చూద్దాం" అన్న రాజకీయ నాయకుని మాటను జనం నమ్మేవారు, ఆతర్వాత ఆమాట వినగానే తమ పని జరగదని అర్థంచేసుకోవడం అలవాటు చేసుకున్నారు.

"చూద్దాం, మీ పని జరుగుతుంది" అనడం చాలామందికి చాలాసార్లు ఎంతో సులువుగా ఉంటుంది. తను కమిట్ కావడం లేదనే ఆనందం ఉంటుంది.

అయితే, "చూద్దాం, మీ పని జరుగుతుంది" అని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు లఖూభాయ్ పాఠక్‌తో తన అలవాటులో పొరపాటుగానే అని ఉంటే, అదేతన గ్రహపాటు అవుతుందని అప్పుడు ఊహించి ఉండడు.

కొన్నిటికి అలవాటు పడకుండా ఉండాలేకానీ, అయ్యేక వాటిని వదిలించుకోవడం సులువేంకాదు. సిగరెట్ కాల్చే అలవాటు చేసుకోవడం చాలా సులువు. అది బాగా అలవాటయ్యాక దాన్ని మానుకోవడం చాలా కష్టం అని ఎందరినో చూశాక తెలుస్తుంది. "సిగరెట్లు మానడం కష్టమేమీ కాదు. నేను చాలాసార్లు మానేశాను" అని జోకులేసేవారు కోకొల్లలు,

కొందరికి అబద్ధాలు ఆడడం అలవాటు.

ఇలాంటివాళ్ళు అవసరం ఉన్నా లేకపోయినా కూడా అబద్ధాలాడేస్తుంటారు. మరికొందరికి ముక్కుసూటిగా ఉండడం అలవాటు. ఇలాంటివాళ్ళు ఎదుటివారికి బాధ కలుగుతుందేమోనని కూడా చూడరు. కొందరికి ప్రతి చిన్నదానికీ నవ్వడం అలవాటు. ఇంకొందరికి ప్రతి చిన్నదానికీ ఏడవడం అలవాటు. కొందరికి అవమానించడం అలవాటు అయితే, కొందరికి నమ్మేయడం అలవాటు.

పాత అలవాట్లను మానలేక పోయినవాళ్ళు మామూలు జనంలోనూ ఉంటారు. రాజకీయ నాయకుల్లోనూ ఉంటారు. ఓ కథలో ఒకతను భార్య చనిపోవడంతో మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. మొదటి భార్యను మరవలేక పోవడమేకాక, పాత అలవాటుతో రెండో భార్యను మొదటి భార్య పేరుతో తరచూ పిలిచేస్తుండేవాడు. దాంతో ఆ రెండో భార్య అతనికి ఎంత దగ్గరవుదామనుకున్నా దగ్గరకాలేకపోయింది.

దేవెగౌడకు తన ఊహల్లోకి కూడా రాని ప్రధాని పదవి దక్కింది. కర్నాటక ముఖ్యమంత్రిగా ఉన్న గౌడ ఏ పార్టీకీ తగిన మెజార్టీ రాకపోవడంతో యునైటెడ్ ఫ్రంట్ తరపున ప్రధాని అయ్యాడు. అయినా ఆయన ముఖ్యమంత్రి తరహాలోనే వ్యవహరిస్తుంటాడు. తను దేశ ప్రధానిననే మాట మరిచి కర్నాటక ప్రయోజనాలకే పాటుపడుతుంటాడు. ఆల్మట్టి డ్యామ్ విషయంలో ఆంధ్ర-కర్నాటక వివాదం గురించి కర్నాటక ముఖ్యమంత్రి దృష్టితోనే చూస్తుంటాడు.

మొన్నటికి మొన్న లోక్‌సభలో 'రాష్ట్రపతి' అని సంబోధించడానికి బదులు 'గవర్నర్' అని, దేవెగౌడ సభ్యుల్ని నవ్వుల్లో ముంచెత్తాడు.

తాను ముప్ఫై అయిదేళ్ళ పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఉన్నందున అసెంబ్లీలోని తన అలవాటు లోక్‌సభలో పొరపాటుగా మారిందని ఆయన సర్దిచెప్పుకున్నాడు.

ఆతర్వాత ఆర్థికమంత్రి చిదంబరం అనడానికి బదులు మన్మోహన్‌సింగ్ అని నాలుక్కరుచుకున్నాడు. ఇంకాసేపటికి అగ్నిక్షిపణికి బదులు అర్జున్ అని తడబడ్డాడు. బహుశా చిటికెలో కునుకు తీసే అలవాటు ఉండడంవల్లే గౌడగారు అలా తడబడి ఉంటాడు. పొరపాట్లు కునుకు తీయడంవల్ల కూడా వస్తుంటాయేమో.

ఎన్నో అలవాట్లలా కునుకు తీయడం కూడా ఓ అలవాటే మరి!

వార్త దినపత్రిక, 7.3.97